


షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
RNI : APTEL / 2023 / 89152
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక




సంపుటి : 2 సంచిక : 343 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 12 డిసెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 343 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 12 December 2025 PAGES : 8 PRICE : 3/-

## ఆ భారాన్ని కూటమి ప్రభుత్వమే భరించాలి

**కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల తీవ్ర విమర్శలు**

**విద్యుత్ ఛార్జీల పెంపునకు ఏపీఈఆర్సీ సిద్ధమవుతోందని ఆరోపణ**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 11)**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే చేతలకు పొంతన లేదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. "చెప్పేవి శ్రీరంగనీతులు.. చేసేవి దొంగ పనులు" అన్నట్లుగా ప్రభుత్వ తీరు ఉందని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపునకు రంగం సిద్ధం చేస్తోందంటూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కరెంట్ ఛార్జీలు పెంచే ప్రసక్తే లేదని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇప్పుడు దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.ఆంధ్రప్రదేశ్ విద్యుత్ -మిగతా 2లో

## ఆయన 'భారతరత్న'కు నిజంగా అర్హుడు

**భారతి జయంతి సందర్భంగా సోషల్ మీడియా వేదికగా నివాళి**


**ఆయన జీవితం నుంచి మూడు ముఖ్యమైన పాఠాలు నేర్చుకున్నానన్న పవన్**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 11)**

ప్రముఖ తమిళ కవి, స్వాతంత్ర్య సమరయోధుడు సుబ్రహ్మణ్య భారతికి భారతరత్న పురస్కారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. గురువారం సుబ్రహ్మణ్య భారతి జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో ఓ పోస్ట్ పెట్టారు. సుబ్రహ్మణ్య భారతి భారతరత్నకు అన్ని విధాలా అర్హుడని పవన్ పేర్కొన్నారు.చెన్నైలో పెరిగిన తాను, సుబ్రహ్మణ్య భారతి జీవితం నుంచి మూడు ముఖ్యమైన పాఠాలు నేర్చుకున్నానని పవన్ కల్యాణ్ తెలిపారు. -మిగతా 2లో

# సాకులు చెబితే సహించను



- దస్త్రాల పరిష్కారంలో మంత్రుల జాప్యంపై చంద్రబాబు తీవ్ర అసంతృప్తి
- 7 రోజుల్లోగా పూర్తికాకుంటే వివరణ ఇవ్వాలన్న సీఎం
- సగటున 15 రోజులకుపైగా సమయం తీసుకుని అట్టడుగున నిలిచిన రాంప్రసాద్‌రెడ్డి
- 2 రోజుల్లోనే పరిష్కరించి టాప్‌లో డోలా
- ఆరో స్థానంలో చంద్రబాబు
- అత్యధికంగా 6,653 దస్త్రాలు పరిష్కరించిన సీఎం
- 9వ స్థానంలో లోకేశ్.. 11వ స్థానంలో పవన్




**(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 11)**

సచివాలయంలో మంత్రులు, హెచ్‌వోడీలు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దస్త్రాల్ని ఆన్‌లైన్‌లో (ఈ-ఆఫీస్) ఎక్కడి నుంచైనా పరిష్కరించే వెసులుబాటు ఉన్నప్పటికీ కొందరు మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులు ఇప్పటికీ రోజుల తరబడి సమయం తీసుకుంటున్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతుల సమావేశంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సాకులు చెబితే సహించేది లేదని, ఇకపై ఏడు రోజుల కంటే ఎక్కువ సమయం తీసుకున్నవారు వివరణ ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ-ఆఫీస్ ఫైల్స్ డిస్పోజల్ నివేదికను ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సమావేశంలో వివరించారు. దాని ప్రకారం 2024 జులై 15 నుంచి 2025 డిసెంబరు 9 వరకు 16 నెలల 24 రోజుల వ్యవధిలో దస్త్రాల పరిష్కారంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అట్టడుగున ఉన్నారు. -మిగతా 2లో

## అఫ్గాన్‌పై పాక్ దాడులను ఖండిస్తున్నాం: భారత్




**(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 11)**

అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడటాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. చిన్నారులు, మహిళలు, క్రికెటర్లపై దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని పేర్కొంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో జరిగిన చర్చలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఐక్యరాజ్య సమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాలను భారత్ గౌరవిస్తుంది. అమాయకులైన పౌరుల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చాలా ఏళ్లుగా బలహీన పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రజలపై ఇలాంటి దాడులు చేయడం సరికాదు. క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న అఫ్గాన్ పై బహిరంగ బెదిరింపులు, యుద్ధచర్యలు వంటివి అంతర్జాతీయ చట్టాన్ని స్పష్టంగా ఉల్లంఘించడమే. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని అన్నారు. అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను తాము సమర్థిస్తున్నామని ఉద్ఘాటించారు. అక్కడి భద్రతా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఐఎస్ఐఎల్, అల్‌ఖైదా, లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి ఉగ్ర సంస్థలు సరిహద్దు ఉగ్రవాదంలో పాల్గొనకుండా చేయాలని పిలుపునిచ్చారు. అఫ్గాన్ ప్రభుత్వంతో సంబంధాలు పెంచుకోవడంపై భారత వైఖరిని ఉద్ఘాటించారు.

## వైజాగ్‌కు గూగుల్ తెచ్చిన లోకేశ్‌ను విమర్శిస్తారా?: వైసీపీపై యార్లగడ్డ ఫైర్




**(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 11)**

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుంటే, వైసీపీ నేతలు విమర్శలు చేయడం దారుణమని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మండిపడ్డారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "75 ఏళ్ల వయసులో చంద్రబాబు రాష్ట్రానికి పెట్టుబడులు తేవాలని నిరంతరం శ్రమిస్తున్నారు.

మరోవైపు మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటనలో గూగుల్, అడోబ్, ఎన్విడియా వంటి 18 ప్రపంచ దిగ్గజ కంపెనీలతో సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. 'గూగుల్ మర్చిపోదు' అన్న సినిమా డైలాగ్‌ను నిజం చేస్తూ, రూ.15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ డేటా సెంటర్‌ను వైజాగ్‌కు తీసుకొచ్చిన ఘనత లోకేశ్‌ది. అలాంటి వ్యక్తిపై వైసీపీ నేతలు విమర్శలు చేయడం హాస్యాస్పదం" అని యార్లగడ్డ అన్నారు.

గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్మోహన్ రెడ్డి ఎప్పుడైనా అమెరికా వెళ్లి ఇలాంటి కంపెనీలతో సమావేశమయ్యారా అని ఆయన ప్రశ్నించారు. "యువగళం పాదయాత్రకు ముందు లోకేశ్ వేరు, తర్వాత లోకేశ్ వేరు. ఆయనతో అరగంట మాట్లాడగలిగే నాయకులు మీ పార్టీలో ఉన్నారా? -మిగతా 2లో

## అమరావతికి శాశ్వత హోదా.. పార్లమెంటులో బిల్లు పెడతాం



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 11)**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి శాశ్వత హోదా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో గానీ, లేదా వచ్చే సమావేశాల్లో గానీ అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ బిల్లు ప్రవేశపెడతామని ఆయన తెలిపారు.రాజధానిని 2014 నుంచి గుర్తించాలా? లేక ఇప్పటి నుంచి గుర్తించాలా? అనే దానిపై ఉన్న సాంకేతిక కారణాల వల్లే బిల్లు ఆలస్యమవుతోందని పెమ్మసాని వివరించారు. ఈ ప్రక్రియను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని అన్నారు. అమరావతి బిల్లుపై వైసీపీ అధినేత జగన్ విషం కక్కుతున్నారని, ఆయనను శాశ్వతంగా రాజకీయ సమాధి చేయాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు పాలన చేతకాకపోవడం వల్లే 34 వేల మంది రైతులు -మిగతా 2లో

## జగన్ విమర్శలపై భాజపా దీటుగా కౌంటర్ ఇవ్వాలి: ప్రధాని మోదీ



**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,డిసెంబర్ 11)**

ఏపీలో సీఎం చంద్రబాబుతో కలిసి ముందుకు సాగడం మంచి పరిణామమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. రాష్ట్రంలో పరిపాలనపై కూడా మంచి ఫీడ్ బ్యాక్ వచ్చిందని చెప్పారు. గురువారం దిల్లీలో ఏపీ, తెలంగాణ, అండమాన్ రాష్ట్రాల భాజపా ఎంపీలకు ప్రధాని అల్పాహార విందు ఇచ్చారు. 15 మంది ఎంపీలతో సుమారు అరగంటపాటు ఆయన మాట్లాడారు.

పెట్టుబడులు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ వైపు వెళుతున్నాయని.. ఇది చాలా మంచి అభివృద్ధి అని మోదీ కితాబిచ్చినట్లు సమాచారం. వైకాపా అధ్యక్షుడు జగన్, ఆయన పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలకు భాజపా కూడా దీటుగా కౌంటర్ ఇవ్వాలని ప్రధాని దిశానిర్దేశం చేశారు.

**తెలంగాణ ఎంపీలపై ఆగ్రహం!**

"తెలంగాణలో ప్రతిపక్ష పాత్ర కూడా పోషించడం లేదు. మంచి టీమ్‌ని పెట్టుకుని సమర్థంగా ఎదుర్కోవడానికి సమస్యేంటి? రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరగడానికి మంచి అవకాశం ఉన్నా దాన్ని ఉపయోగించుకోవడంలో విఫలమవుతున్నారు" అని మోదీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జాతీయ పరిణామాలపై తెలుగు ఎంపీలు యాక్టివ్‌గా ఉండాలని, పలు రాష్ట్రాల్లో పర్యటించి ఆయా అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు.

## 1 మిలియన్ డాలర్లకే 'గోల్డ్ కార్డు'.. విక్రయాలు ప్రారంభించిన ట్రంప్

**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,డిసెంబర్ 11)**

అమెరికా పౌరసత్వం కావాలని కోరుకునే సంపన్నులకు అధ్యక్షుడు ట్రంప్ 'గోల్డ్ కార్డు 'ను ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా దీని విక్రయాలను ట్రంప్ ప్రారంభించారు. 1 మిలియన్ డాలర్లు చెల్లించి అగ్రరాజ్యంలో నివాసం పొందే అవకాశం పొందవచ్చు. వైట్‌హౌస్‌లోని కొందరు వ్యాపారవేత్తలతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ట్రంప్ దీన్ని ప్రారంభించారు. ఈ గోల్డ్ కార్డు కోసం ప్రత్యేకంగా ఓ వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేశారు. 1990లో విదేశీ పెట్టుబడుల కోసం %జూబె%-5 ప్రోగ్రామ్‌ను తీసుకొచ్చారు. అయితే, ఈ విధానంలో జరుగుతున్న మోసాలు, అక్రమాలను అరికట్టాలని




నిర్ణయించుకున్నట్లు ట్రంప్ చెప్పారు. దీని స్థానంలోనే గోల్డ్ కార్డును ప్రకటించారు. సంవత్సరాలు సమయం తీసుకొనే నియామక ప్రక్రియ నుంచి ఉపశమనం కల్పిస్తోందన్నారు. తనకు చాలా ఉత్సాహంగా ఉందని, దేశం కోసం గోల్డ్ కార్డును ప్రారంభించా అని ట్రంప్ చెప్పారు. ఈ కొత్త వెబ్‌సైట్ నిమిషాల్లోనే దరఖాస్తులను స్వీకరించడం ప్రారంభిస్తుందన్నారు. -మిగతా 2లో

## అమరావతి క్వాంటమ్ వ్యాలీలో రూ.200 కోట్లతో గ్లోబల్ బయో ఫౌండ్రీ

### అమరావతిలో గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ ఏర్పాటుకు ప్రతిపాదన




**(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 11)**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, అత్యాధునిక సాంకేతిక పరిశోధనలకు కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న 'క్వాంటమ్ వ్యాలీ'ని వేదికగా చేసుకొని, నూతన ఔషధాలు, మెటీరియల్ సైన్స్‌పై పరిశోధనలు చేసేందుకు 'గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ' ముందుకొచ్చింది. రూ. 200 కోట్ల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పలు దేశాలకు చెందిన పరిశోధకులు, విద్యావేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో కూడిన బృందం సమావేశమై తమ ప్రతిపాదనలను వివరించింది.

ఈ సందర్భంగా గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ ప్రతినిధులు మాట్లాడుతూ, అమరావతిలో ఏర్పాటు చేయబోయే ఈ కేంద్రం దేశంలోనే తొలి క్వాంటమ్ బయోమెడికల్ రీసెర్చ్ ఎకో సిస్టంగా నిలుస్తుందని తెలిపారు. మాలిక్యులర్ మోడలింగ్, డ్రగ్ డిస్కవరీ సిమ్యులేషన్స్, మెటీరియల్ సైన్స్ వంటి క్లిష్టమైన రంగాల్లో తమ పరిశోధనలు సాగుతాయని ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీ ప్రభుత్వ విధానాలు, క్వాంటం వ్యాలీ ఏర్పాటు వంటి అంశాలు తమను ఎంతగానో ఆకర్షించాయని వారు పేర్కొన్నారు.

ఈ ప్రతిపాదనపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఆధునిక పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా మారాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వైద్యారోగ్యం, ఔషధాల తయారీ వంటి రంగాల్లో విస్తృత పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. క్వాంటమ్ పరిశోధనల ద్వారా బయోసెన్సార్ల వంటి అప్లికేషన్లను అభివృద్ధి చేసి, వాటి ఫలాలను ప్రజా ప్రయోజనాల కోసం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గతంలో ఐటీ, జీనోమ్ వ్యాలీ వంటివి ఎలా విజయవంతమయ్యాయో, ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ కూడా అదే స్థాయిలో నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

త్వరలోనే అమరావతిలో ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రం (ఏక్యూసీసీ) కార్యకలాపాలు ప్రారంభిస్తుందని చంద్రబాబు తెలిపారు. జాతీయ క్వాంటమ్ మిషన్‌ను అందిపుచ్చుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళుతోందని వివరించారు. క్వాంటమ్ బయో ఫౌండ్రీ ఏర్పాటు ఒక వినూత్న ఆలోచన అని అభినందించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ, రవాణా వంటి కీలక రంగాల భాగస్వాములందరూ క్వాంటమ్ వ్యాలీ సేవలను వినియోగించుకునేలా ఒక సమగ్ర ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఐఐటీలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలకు ఇది కీలక కేంద్రంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్యాధికారులు పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 11)**

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్యాధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ జిల్లాస్థాయి కమిటీ సమావేశం గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఎన్టీఆర్ వైద్య సేవలు ప్రజలకు సక్రమంగా అందించాలని కలెక్టర్ చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ కార్డులు అందించాలన్నారు. పిఎంజిఏవై కార్డులను లబ్ధిదారులైన ఆయా కుటుంబాలకు అందించాలన్నారు. ప్రధానమంత్రి ఆరోగ్య కార్డుల ఈకేవైసీ జిల్లాలో 9,600 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. లబ్ధిదారుల ఈకేవైసీ తప్పనిసరిగా చేపట్టాలన్నారు. వైద్యశాలల్లో ఔషధాల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఔషధాల కొరకు ముందస్తు ఇండెంట్ పంపాలని సూచించారు. జిల్లాకు సరిపడా మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. బాపట్ల జిల్లా తీర ప్రాంతం కావడంతో మొక్కలు, చెట్లు అధికంగా ఉన్నందున పాముకాటుకు గురైన వారికి తక్షణమే వైద్యం అందించేందుకు ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి వైద్యశాలలో సంబంధిత ఔషధాలు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజల ప్రాణాలకు ఎలాంటి హాని జరగకుండా వైద్యాధికారులు మంచి వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించేలా మీ సేవలు విస్తృతం కావాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఏపీ వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ పద్మావతి, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ డాక్టర్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

### మొదటి పేజీ తరువాయి

## సాకులు చెబితే సహించను

ఆయన సగటున 15 రోజుల 19 గంటల 53 నిమిషాల సమయం తీసుకుని, 25వ స్థానంలో నిలిచారు. ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర 24వ స్థానంలో, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 23వ స్థానంలో ఉన్నారు. ఫైళ్లను వేగంగా క్లియర్ చేసిన మంత్రుల్లో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి 2 రోజుల 41 నిమిషాలతో మొదటి స్థానంలో నిలిచారు. 2 రోజుల 7 గంటలతో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రెండో స్థానంలో, 2 రోజుల 9 గంటల 59 నిమిషాలతో న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మూడో స్థానంలో ఉన్నారు.

**రాంప్రసాద్‌రెడ్డికి నాకంటే సెన్సిటివ్ ఫైల్స్ వస్తాయా: సీఎం**

దస్త్రాల పరిష్కారంలో జాప్యంపై అందర్నీ ఒకే గాటన కట్టడం సరికాదని... విజిలెన్స్, ఏసీబీ వంటి కేసుల ఉపసంహరణ కోసం వచ్చిన దస్త్రాలు ఎక్కువగా ఉండటంతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దగ్గర జాప్యం జరిగిందని కాటమనేని భాస్కర్ తెలిపారు. మంత్రులు కొల్లు రవీంద్ర, మనోహర్ వద్ద కూడా అలాంటి కేసుల దస్త్రాలే ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని, ఆర్థిక మంత్రి కేశవ్ దగ్గర నిధుల కోసం వచ్చిన విజ్ఞప్తుల ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. దానిపై సీఎం స్పందిస్తూ.. 'రాంప్రసాద్‌రెడ్డికి నాకొచ్చే వాటికంటే సెన్సిటివ్ ఫైల్స్ వస్తాయా? కారణం ఏదైనా దస్త్రాల పరిష్కారానికి 15 రోజులు తీసుకోవడం సరికాదు. ఇకపై సాకులు చెబితే ఊరుకోను. గిరిజన సంక్షేమశాఖలో ఒక్కో దస్త్రం పరిష్కారానికి 12 రోజులు తీసుకున్నారు. అసలే గిరిజనులు వెనుకబడిన ప్రజలు. వారిని మీరు మరింత వెనుకబాటులోకి నెట్టేస్తున్నారు' అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఏఎస్ అధికారి రేఖారాణికి వచ్చే దస్త్రాలే తక్కువని, ఆమె 11 రోజులు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. ఇకపై మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఎవరైనా దస్త్రాల పరిష్కారంలో వెనుకబడితే ముఖ్యమంత్రి హోదాలో వాటిని తానే స్వయంగా పరిశీలించి, వారిని సెన్సిటైజ్ చేస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు.

**జనవరి 15 తర్వాత ఫిజికల్ ఫైల్స్ ఉండొద్దు**

జిల్లాల్లో ఇప్పటికీ చాలా దస్త్రాల్ని ఫిజికల్‌గా నడుపుతున్నారని భాస్కర్ చెప్పగా... జనవరి 15 తర్వాత మాన్యువల్ ఫైల్ అన్నది ఉండటానికి వీల్లేదని, అన్నీ ఆన్‌లైన్ చేయాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. చేయనివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వైజాగ్‌కు గూగుల్ తెచ్చిన లోకేశ్‌ను విమర్శిస్తారా?: వైసీపీపై యార్లగడ్డ ఫైర్

ఆలోచించుకోండి" అని హితవు పలికారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొడాలి నానిపై యార్లగడ్డ తీవ్ర విమర్శలు చేశారు. "గుడివాడ ప్రజలు ఓడించారనే కక్షతో ఏడాది పాటు నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదు. అధికారం లేనప్పుడు ప్రజలకు సేవ చేయడమే గొప్పతనం. గతంలో మేం ఓడిపోయినా ప్రజల మధ్యే ఉన్నాం" అని గుర్తుచేశారు. బూతులు తిట్టడం, అగౌరవంగా మాట్లాడటం మానుకుని, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని, కనీసం గౌరవంగా అసెంబ్లీకి రావాలని వైసీపీ నేతలకు ఆయన సూచించారు. అక్రమ కేసుల కారణంగానే తన పాస్‌పోర్ట్ సమస్య వచ్చిందని, అందుకే లోకేశ్‌తో పాటు అమెరికా పర్యటనకు వెళ్లలేకపోయానని యార్లగడ్డ ఆవేదన వ్యక్తం చేశారు.

## ఆ భారాన్ని కూటమి ప్రభుత్వమే భరించాలి

నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సుమారు రూ.15,651 కోట్ల మేర విద్యుత్ ఛార్జీలను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రజాభిప్రాయ సేకరణకు ప్రకటన కూడా జారీ చేసిందని షర్మిల గుర్తుచేశారు. ఇంత జరుగుతున్నా, ప్రజలపై భారం పడదని ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని పదేపదే చెప్పడం పాత చింతకాయ పచ్చడిలా ఉందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.15 వేల కోట్లను ప్రజల నుంచి ట్రూ-అప్ బిల్లుల రూపంలో వసూలు చేసి వారి జేబులకు చిల్లులు పెట్టారని ఆరోపించారు.

ఇప్పుడు మరోసారి 'టైమ్ ఆఫ్ ది డే' పేరుతో ఇంకో రూ.15 వేల కోట్లను దోచుకునేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని షర్మిల ఆరోపించారు. నమ్మి ఓటేసినందుకు ఏడాదికోసారి ప్రజలకు ఇలా 'హైటెన్షన్ షాక్' ఇస్తున్నారని, ఆర్థిక లోటు పేరుతో ప్రజల నడ్డి విరవడం దారుణమని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ పక్షాన ముఖ్యమంత్రికి కొన్ని డిమాండ్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. "మీకు నిజంగా ఛార్జీలు పెంచకూడదనే చిత్తశుద్ధి ఉంటే, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మీద నిలబడాలనుకుంటే, ఏపీఈఆర్‌సీ ప్రతిపాదనలపై తక్షణం స్పందించండి. ప్రతిపాదిత రూ.15 వేల కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని అధికారికంగా ప్రకటించండి. అలాగే, ఇప్పటివరకు ప్రజలపై మోపిన రూ.15 వేల కోట్ల సర్దుబాటు ఛార్జీలను కూడా వెంటనే రద్దు చేయాలి" అని షర్మిల డిమాండ్ చేశారు.

## ఆయన 'భారతరత్న'కు నిజంగా అర్హుడు

"1) మాతృభూమి పట్ల నిర్భయమైన నిబద్ధత, 2) మాతృభాషపై ప్రేమ, 3) బహుభాషా నైపుణ్యాలు, ఇతర భాషల పట్ల గౌరవం.. ఈ మూడు విషయాలు ఆయన నుంచి నేర్చుకోవాలి. ఆయన నిజంగా భారతరత్నకు అరుడు" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

మరోవైపు, హరీశ్ శంకర్ డైరెక్షన్ లో పవన్ కల్యాణ్ నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా అప్‌డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'దేఖ్లేంగే సాలా' అనే ఫస్ట్ సింగిల్‌కు సంబంధించిన ప్రోమో ఇప్పటికే అంచనాలను పెంచేసింది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ పాటను విశాల్ దద్లానీ ఆలపించారు. భాస్కరభట్ల సాహిత్యం అందించగా, దినేష్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. పూర్తి పాటను డిసెంబర్ 13న విడుదల చేయనున్నారు.

ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రిగా రాజకీయాలతో బిజీగా ఉన్నప్పటికీ, పవన్ కల్యాణ్ ఈ సినిమా షూటింగ్ కోసం సమయం కేటాయించడం పట్ల గతంలో చిత్రబృందం ప్రశంసలు కురిపించింది.

## 1 మిలియన్ డాలర్లకే 'గోల్డ్ కార్డు'.. విక్రయాలు ప్రారంభించిన ట్రంప్

ఈ గోల్డ్ కార్డు కోసం వ్యక్తులు 1 మిలియన్ డాలర్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కంపెనీలు తమ ప్రతిభావంతులను ఇక్కడ ఉంచేందుకు 2 మిలియన్ డాలర్లు చెల్లించవచ్చన్నారు. 'మన దేశంలోకి గొప్ప వ్యక్తులు రావడం మంచి విషయం. భారత్, చైనా, యూరప్ దేశాలకు తిరిగి వెళ్లిపోతున్న ప్రతిభావంతులు ఇప్పుడు అగ్రరాజ్యంలోనే ఉండొచ్చు' అని అన్నారు.

వీసా వ్యవస్థను సరిచేయాలంటూ తనపై ఒత్తిడి చేసిన వ్యాపారవేత్తల గురించి ట్రంప్ మాట్లాడారు. ఈ క్రమంలో ఆపిల్ సీఈవో టిమ్ కుక్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. వీసా అనిశ్చితుల కారణంగా కంపెనీలు అత్యంత ప్రతిభావంతులను కోల్పోవాల్సి ఉంటుందని కుక్ తనతో చెప్పారన్నారు. తాజా కార్యక్రమంతో అమెరికా ఖజానాకు బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చి పడుతుందని అభిప్రాయపడ్డారు. ఇక, వైట్‌హౌస్ కూడా బుధవారం మధ్యాహ్నం నుంచి ఈ గ్రీన్ కార్డు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించడం ప్రారంభించింది.

## అమరావతికి శాశ్వత హోదా.. పార్లమెంటులో బిల్లు పెడతాం

ఇచ్చిన భూములను సద్వినియోగం చేసుకోలేక రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేశారని ఆరోపించారు. అమరావతిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే వేలాది మంది నిర్మాణ పనుల్లో పాలుపంచుకుంటున్నారని పెమ్మసాని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే 16 జాతీయ సంస్థలకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. త్వరలోనే హడ్కో, కాగ్, పోస్టల్ భవనం, కేంద్రీయ విద్యాలయాలు వంటివి అమరావతిలో ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారుల నిర్మాణానికి కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశామని ఆయన వెల్లడించారు.

# నేడు విశాఖలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పర్యటన... కాగ్నిజెంట్, సత్వా క్యాంపస్‌లకు భూమి పూజ

**విశాఖలో కాగ్నిజెంట్, సత్వా గ్రూప్ భారీ పెట్టుబడులు**

**నేడు రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న సీఎం, మంత్రి లోకేశ్**

**మరో 7 ఐటీ క్యాంపస్ లకు కూడా భూమిపూజ చేయనున్న లోకేశ్**

**రూ.3000 కోట్లకు పైగా పెట్టుబడులు, 33 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 11)**

ఐటీ హబ్‌గా విశాఖను తీర్చిదిద్దే దిశగా కీలక ముందడుగు ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత విశాఖపట్నం ఐటీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. నగరాభివృద్ధిలో కీలక మైలురాళ్లుగా నిలిచే రెండు భారీ ప్రాజెక్టులకు రేపు (డిసెంబరు 12) శ్రీకారం చుట్టనున్నారు. అంతర్జాతీయ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్‌తో పాటు, ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ తమ క్యాంపస్‌ల నిర్మాణానికి భూమి పూజ చేయనున్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా విశాఖలో రూ.3,000 కోట్లకు పైగా పెట్టుబడులు రానుండగా, ప్రత్యక్షంగా 33 వేలకు పైగా ఉద్యోగాలు లభించనున్నాయి.

విశాఖ కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో 21.31 ఎకరాల్లో నిర్మించనున్న కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేస్తారు. ఈ సంస్థ రూ.1,583 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో ఈ క్యాంపస్‌ను నిర్మించనుంది. దీని ద్వారా 8 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 2033 నాటికి నిర్మాణం పూర్తి కానుండగా, మొదటి దశను 2029 నాటికి పూర్తి చేసి 3 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో, రుషికొండలోని మహతి ఫిన్ టెక్ భవనంలో వెయ్యి సీటింగ్ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయాన్ని ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రారంభిస్తారు. ఈ కేంద్రం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలపై దృష్టి సారిస్తుంది.

మరోవైపు, దేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ విశాఖ మధురవాడలోని హిల్-4లో నిర్మించనున్న 'సత్వా వాంటేజ్ వైజాగ్ క్యాంపస్'కు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు. రూ.1,500 కోట్ల పెట్టుబడితో 30 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు. దీని ద్వారా ప్రత్యక్షంగా 25 వేల మందికి, పరోక్షంగా 40 వేల నుంచి 50 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఈ క్యాంపస్‌లో కేవలం ఐటీ కార్యాలయాలే కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో నివాసాలు, రిటైల్, హాస్పిటాలిటీ సదుపాయాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో భారీ ప్రాజెక్టులు నిర్మించిన సత్వా గ్రూప్, విశాఖలో రాబోయే ఐదేళ్లలో 4 మిలియన్ చదరపు అడుగుల ఐటీ ఆఫీస్ స్పేస్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగ్నిజెంట్, సత్వా గ్రూప్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల రాకతో విశాఖపట్నం త్వరలోనే గ్లోబల్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా మారనుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కాగ్నిజెంట్, సత్వా గ్రూప్ తో పాటు విశాఖపట్నంలో మరో 7 ఐటీ సంస్థల క్యాంపస్ ల నిర్మాణాలకు కూడా నారా లోకేశ్ రేపు భూమిపూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించనున్నారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు   తెలుగు దినపత్రిక
ప్రకాశం

# స్వర్ణాంధ్ర ప్రగతి సూచికలు అభివృద్ధి దిశగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 11)

స్వర్ణాంధ్ర ప్రగతి సూచికలు అభివృద్ధి దిశగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. స్వర్ణాంధ్ర ప్రగతి సూచికలపై వివిధ శాఖల అధికారులతో గురువారం ఆయన స్థానిక కలెక్టరేట్ నుంచి హైబ్రిడ్ మోడ్‌లో సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లా ప్రగతి దిశగా పయనించాలని కలెక్టర్ సూచించారు. ఇంజినీరింగ్ శాఖలకు అభివృద్ధి ఆధారంగా ప్రభుత్వం ర్యాంకులను ఇస్తుందన్నారు. నాలుగు గ్రేడ్ లలోనూ అభివృద్ధి కనిపించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి స్థిరమైన గృహం ఉండడం గృహ నిర్మాణశాఖ అధికారులకు లక్ష్యంగా ఉందన్నారు. అదే మాదిరిగా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడం, పైప్ లైన్లు వేయడం ఇందులో భాగమేనన్నారు. గృహ వినియోగానికి విద్యుత్ సరఫరా నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ అధికారులపై ఉందన్నారు. ప్రజలకు సుఖమయ ప్రయాణం సాగేలా మంచి రహదారులను అభివృద్ధి చేయాలన్నారు. గుంతలు రహిత రహదారులు ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునే అవకాశాలు కల్పించాలన్నారు. మునిసిపాలిటీలలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పద్ధతి ప్రకారం చెత్త తొలగింపు జరగాలి, చెత్త నుంచి సంపద సృష్టించాలన్నదే ప్రగతి సూచికలకు ప్రాముఖ్యమన్నారు. గ్రానైట్ ఉత్పత్తి మరింత పెరిగితే ఆదాయ వనరులు మెరుగు పడతాయన్నారు. జిల్లాలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. స్వర్ణాంధ్ర ప్రగతి సూచికలపై ప్రతినెల మూడో తేదీలోగా జిల్లాలోని అధికారులు స్వర్ణాంధ్ర పోర్టల్‌లో వివరాలను పొందుపరచాలన్నారు. ఈ సమావేశంలో సిపిఓ షాలేమురాజు, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆంజనేయులు, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ అనంతరాజు, గృహ నిర్మాణ శాఖ పిడి వెంకటేశ్వర్ రావు, మైనింగ్ శాఖ డిడి రామచంద్ర, ఆర్అండ్‌బి డిఈ అరుణ కుమారి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డివిజన్, మండల స్థాయి ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి బాలినేనికి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ

## నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో విరజిల్లాలి

## జిల్లా నలుమూలల నుండి హైదరాబాదులోని ఆయన స్వగృహానికి పోటెత్తిన అభిమానులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 11)

మాజీ మంత్రి, జనసేన రాష్ట్ర నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రకాశం జిల్లా నలుమూలల నుండి నాయకులు, కార్యకర్తలు గురువారం హైదరాబాదులోని ఆయన నివాసానికి పెద్ద ఎత్తున తరలివెళ్లి శాలువాలు, పూలమాలలు, బొకేలతో ఘనంగా సన్మానించి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బాలినేని శ్రీనివాసరెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో విరజిల్లి, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, మార్కాపురం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు గుంటక సుబ్బారెడ్డి, మాజీ డిఆర్‌యుసిసి మెంబర్ ఎమ్ ఎన్ రెడ్డి, షేక్ అన్వర్ హుస్సేన్, దొంతుల హరి కిషోర్ (కాపునాడు స్టేట్ వైస్ ప్రెసిడెంట్), ఒంగోలు కార్పొరేటర్ గోలి కోటేశ్వరమ్మ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమేష్, తాళ్లూరు మాజీ జెడ్పిటిసి వెంకటరెడ్డి, జిల్లా నలుమూలల నుండి బాలినేని అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. (తరువాయి 4లో...)

# ప్రజలు సంతృప్తిచెందే విధంగా ప్రభుత్వ సేవలు అందించాలి

## వీడియో సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 11)

రాష్ట్రంలో ప్రజలు సంతృప్తిచెందే విధంగా ప్రభుత్వ సేవలు అందించాలనిరాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయా నంద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాల యం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రభుత్వ పథకాలపై ప్రజల సంతృప్తి, పెన్షన్లు పంపిణీ, దీపం పథకం, నిత్యావసరసరుకుల పంపిణీ, పారిశుధ్యం ధాన్యసేకరణ తదిత రంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయా నంద్ మాట్లాడు తూప్రభుత్వ సేవలను ప్రజలకు సులభతరంగా అందించాలని ఆయన చెప్పారు. రాష్ట్రంలో పెన్షన్లను నూరుశాతం పంపిణీ అయ్యే విధంగా చర్యలుతీసుకోవాలని ఆయన చెప్పారు. రాష్ట్రంలో పారిశుధ్య కార్మికులు వారంలో రెండు రోజులు ఇంటి నుండి చెత్త సేకరణ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో, గ్రామీణప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమా ల పై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్లను ఆయన ఆదేశించారు. రాష్ట్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజల కుసులభతరంగా సేవలుఅందించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ధాన్య సేకరణకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ప్రకాశం జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లాకలెక్టర్ పి. రాజ బాబు మాట్లాడుతూ జిల్లాలో పారిశుద్ధ కార్యక్రమాలు ముమ్మ రంగా చేపట్టడానికి చర్యలుతీసుకుంటూ మని ఆయన చెప్పారు. జిల్లాలో వరి ధాన్య సేకరణ అవసర మైన అన్ని రకాల చర్యలు తీసుకు న్నామని సందర్భంగా చెప్పారు. ప్రకాశం జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అర్ గోపాలకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పద్మశ్రీ, జిల్లా మేనేజర్ వరలక్ష్మి, సిపిఓ సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా విద్యాశాఖ అధికారిణిగా బాధ్యతలు చేపట్టిన సి వి రేణుక





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 11)

ప్రకాశం జిల్లా విద్యాశాఖ అధికారిణిగా సి వి రేణుక గురువారం నూతన బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారిణిగా పనిచేసి సాధారణ బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి రాజాబాబును ఆమె కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# కందుల నారాయణరెడ్డిని విమర్శించే అర్హత

## యర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు లేదు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 11)

పశ్చిమ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన మా నాయకుడు కందుల నారాయణరెడ్డిని విమర్శించే అర్హత ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు లేదని దళిత సంఘం నాయకులు హెచ్చరించారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో దళిత నాయకులు మాట్లాడారు. పశ్చిమ ప్రాంతం గురించి తెలియని ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఈ ప్రాంతం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కందుల గురించి మాట్లాడే అర్హత లేకపోయినా ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన ఈ ప్రాంతం గురించి ఏమీ తెలియకపోయినా ఈ ప్రాంతం కోసం కష్టపడే కందుల నారాయణరెడ్డి గురించి మాట్లాడటం సమంజసం కాదన్నారు. ఆయన తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, గత వైసీపీ ప్రభుత్వం పశ్చిమ ప్రాంత అభివృద్ధిని మరిచి ఈ ప్రాంత జిల్లాను విస్మరించి ఈ ప్రాంత ప్రజల మనోభావాలను దెబ్బతీశారన్నారు. నేడు అదే కోవకు చెందిన ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్ జిల్లా సంబరాలు (తరువాయి 4లో...)

## సిపిఐ ఆఫీస్‌కు వచ్చిన సినీదర్శకుడు బాబ్జి





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 11)**
నల్లపూసలు, ఎన్టీఆర్ నగర్, రఘుపతి వెంకయ్య నాయుడు, పోలీసు వారి హెచ్చరిక చిత్రాల దర్శకుడు, ప్రజానాట్యమండలి చలనచిత్ర విభాగ అధ్యక్షుడు బాబ్జి గురువారం మార్కాపురం సిపిఐ కార్యాలయానికి సందర్శించి జిల్లా కార్యవర్గ సభ్యులు అందే నాసరయ్యతో ముచ్చటించారు. ఈ సందర్భంగా నాటి సిపిఐ ఉద్యమ తీపి గుర్తులు, విద్యార్థి దశలో జరిగిన ఉద్యమాలు గుర్తు చేశారు. త్వరలో జరగబోవు సిపిఐ శతాబ్ది మహాసభలు తదితర విషయాలపై అందే నాసరయ్యతో ముచ్చటించారు. అత్యంత వెనుకబడ్డ పశ్చిమ ప్రకాశ ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దర్శి నియోజకవర్గాన్ని మార్కాపురం జిల్లాలో కలిపినప్పుడే అభివృద్ధి పరుగులు తీస్తుందని పేర్కొన్నారు. ఉద్యమాల పురిటిగడ్డ మార్కాపురం అని, ఈ ప్రాంత ప్రజలు సుమారు 63 రోజులు రిలే దీక్షలు అలుపెరగని ఉద్యమాలు చేసి జిల్లా సాధనకు కృషి చేశారని నాటి జిల్లా సాధన తీవ్రతను గుర్తు చేశారు. ఆప్తులు, అన్నా అని ప్రేమగా పిలుచుకునే అందే నాసరయ్యని కలవడం ఆనందంగా ఉందన్నారు.

## స్క్రబ్ టైపస్ పట్ల అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలి

**మున్సిపల్ కమిషనర్ వై రామకృష్ణయ్య**






**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 11)**
చీమకుర్తి పురపాలక సంఘ కార్యాలయం నందు స్క్రబ్ టైపస్ పై గురువారం మున్సిపల్ కమిషణర్ వై రామకృష్ణయ్య ఆధ్వర్యంలో రివ్యూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్క్రబ్ టైపస్ అనే జ్వరం ఎక్కువగా పొలాల్లో పనిచేస్తున్న, గడ్డి పైన ఆడుకునే పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుందన్నారు. స్క్రబ్ టైపస్ అనేది చిన్న కీటకం కాటు వల్ల వస్తుందని పేర్కొన్నారు. సరైన సమయంలో దీనికి చికిత్స చేయటం ఎంతో అవసరమన్నారు. చిగురుటాక అనే చిన్న కీటకం ఈ బ్యాక్టీరియాని వ్యాపింప చేస్తుందన్నారు. ఇది గడ్డి, పొలాల్లో ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ కీటకం కుట్టినప్పుడు బ్యాక్టీరియా రక్తంలోకి చేరుతుంది కాటు వేసిన మూడు నుంచి పది రోజుల్లో లక్షణాలు కనిపిస్తాయన్నారు. కాటు ఉన్నచోట నల్లటి మచ్చ ఇది ముఖ్య గుర్తు అధిక జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి రావడం జరుగుతుందని వివరించారు. కావున పట్టణ ప్రజలు దీని పై అవగాహన కలిగి తగిన జాగ్రత్తలు పాటించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి బాలినేనికి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ







## ఎబివిపి 44వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 11)**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) ఆధ్వర్యంలో ఈ నెల 19, 20, 21వ తేదీల్లో ఒంగోలులో జరగబోయే 44వ రాష్ట్ర మహాసభల యొక్క గోడ పత్రికలను గురువారం ఒంగోలులో ఎబివిపి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట గోపి ఎంసీఏ భవనం నందు జరిగిన విలేకరుల సమావేశంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు విభాగ్ కన్వీనర్ వినయ్, ప్రకాశం జిల్లా కన్వీనర్ గురునాథం, ఒంగోలు నగర కార్యదర్శి నరేంద్ర, ప్రకాశం జిల్లా కార్యాలయ కార్యదర్శి నాగ చరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కందుల నారాయణరెడ్డిని విమర్శించే అర్హత యర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు లేదు

అని సంకలు గుద్దుకోవడం, ఇతర అణుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. వైసిపి ప్రభుత్వం ఎమ్మెల్యేలను ఉద్యోగుల్లా బదిలీ చేస్తుంటే ఆ బదిలీల్లో భాగంగా యర్రగొండపాలెం వచ్చిన తాటిపర్తి చంద్రశేఖర్ ఈ ప్రాంతం, ఈ ప్రాంత అభివృద్ధి, జిల్లా ఆవశ్యకత తెలియకుండా, పశ్చిమ ప్రాంతం గురించి ఎటువంటి అవగాహన లేకుండా మాట్లాడం అతని విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఈ ప్రాంత ప్రజల మనోభావాలను దెబ్బతీస్తే మరోసారి ఈ ప్రాంతంలోకి అడుగుపెట్టలేరని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో దళిత సంఘం నాయకులు పులి వేముల ఏసుదాస్, నందం శేఖర్, పిల్లి సుబ్బు, దారివేముల బాబి, నాగార్జున, మరికపూడి రాజు, కే వినోద్ కుమార్, బల్లాని రమణ, మందపాటి సురేష్, ఎనిభైర కిషోర్, వేసే పోగు జాన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సంతృప్తిచెందే విధంగా ప్రభుత్వ సేవలు అందించాలి




# నగరంలో రూ.4.98 కోట్లతో డ్రయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపన

**ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు**







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 11)**
ఒంగోలు నగరంలో రూ.4.98 కోట్లతో నిర్మించనున్న మెయిన్ డ్రెయిన్ల నిర్మాణాలకు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు శంకుస్థాపన చేశారు. భాగ్యనగర్ నుండి పొగాకు బోర్డు కార్యాలయం వరకు, రాజీవ్ నగర్ వద్ద రూ.1.15 కోట్లు ఇందిరమ్మ కాలనీలో రూ.2.35 కోట్లతో నిర్మించనున్న మెయిన్ డ్రెయిన్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం దామచర్ల మీడియాతో మాట్లాడుతూ నగరంలో నాలుగు ప్రధాన డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీటి నిర్మాణాలు పూర్తయితే భవిష్యత్తులో వర్షాలు కురిసిన సమయంలో రోడ్లపై నీరు నిలవకుండా సాఫీగా వెళ్లేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. నగరంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. టిట్కో ఇల్లు కూడా త్వరలో లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు దామచర్ల జనార్ధన్ రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఉడా చైర్మెన్ షేక్ రియాజ్, కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఎంఈ ఐసయ్య, కార్పొరేటర్‌లు ఈదర సురేష్ బాబు, వేమూరి బుజ్జి, 19వ డివిజన్ అధ్యక్షులు ఇందుర్తి మారుతీరావు, కొఠారి నాగేశ్వరరావు, పాలూరి వెంకటేశ్వర రెడ్డి, బోను దుర్గ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి చాప చుట్టిన కూటమి ప్రభుత్వం




## సబ్సిడీ రుణాలకు బడ్జెట్ రిలీజ్ చెయ్యాలి
## దళిత హక్కుల నేత నీలం నాగేంద్ర డిమాండ్

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 11)**

ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చాప చుట్టిందని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బాపట్ల కలెక్టరేట్ కు వచ్చిన నీలం నాగేంద్రరావు విలేకరులతో మాట్లాడారు. దళిత బహుజనుల ఐక్యతను విచ్ఛిన్నం చేయటమే కూటమి ప్రభుత్వ అజెండాగా కనిపిస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణపై ఉన్న శ్రద్ధ కూటమి ప్రభుత్వానికి ఎస్సీల సంక్షేమంపై లేదన్నారు. ప్రమోషన్లలో కూడా వర్గీకరణ అమలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్న చంద్రబాబు అండ్ కో రాష్ట్రంలో నిరుద్యోగ ఎస్సి యువతకు ఉపాధి కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వేలాది ఎస్సీ బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఎస్సీలకు స్మశాన స్థలాలు కేటాయించడం లేదన్నారు. ఎస్సీ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకునే అర్జీదారుల వయస్సు కేవలం 50 సంవత్సరాలకే పరిమితం చేసిందన్నారు. 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు, ప్రభుత్వం ఏర్పాటు చేశాక, పెన్షన్ ఊసే ఎత్తటం లేదన్నారు. మరోవైపు బీసీ రుణాలకు దరఖాస్తుదారుల వయోపరిమితి 55 సంవత్సరాల వరకు నిర్ణయించడం, ఎస్సీ బీసీల మధ్య ఈర్షను పెంచడమేనన్నారు. చంద్రన్న బీమా నిధులు ఆపేశారని, కులాంతర వివాహ ప్రోత్సాహ నిధులకు దిక్కు లేదని నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పేరుతో ప్రపంచ బ్యాంకు నుండి నిధులు తెచ్చుకుంటున్న చంద్రబాబు ఎస్సీ ఎస్టీలకు కేంద్రం నుంచి రావలసిన ఎన్.ఎస్.ఎఫ్.డి.సి, ఎన్.ఎస్.కె.ఎఫ్.డి.సి, నిధులు తెచ్చేందుకు కనీస ప్రయత్నం కూడా చేయలేదన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫారసులు అమలు చేయడం లేదన్నారు. జిల్లాల్లో ఇంతవరకు జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదన్నారు. కమిటీలు ఏర్పాటు చేసిన ఒకటి రెండు జిల్లాల్లో, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను కమిటీలో నియమించారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో, శాఖల్లో కీలక పోస్టుల్లో మాల ఉద్యోగులకు, అధికారులకు ఉద్దేశపూర్వకంగా పోస్టులు నిరాకరించి తీవ్ర అన్యాయం చేశారన్నారు.

కూటమి ప్రభుత్వం మాలల వ్యతిరేక ప్రభుత్వం మాత్రమే కాదని, మానవత్వం లేని ప్రభుత్వం అని నాగేంద్ర మండిపడ్డారు. రీ సర్వే పేరుతో అగ్రకులాలకు భూములను వెనక్కి ఇప్పిస్తున్న అగ్రకుల మనువాద ప్రభుత్వం, అన్యాక్రాంతమైన అసైన్మెంట్ భూములను, ఈనాం భూములను మాత్రం దళిత బహుజనులకు ఇప్పించడం లేదన్నారు. రీ సర్వే లో కూడా కుల వివక్ష చోటు చేసుకుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి ఎస్సీ ఎస్టీ, బీసీ సంక్షేమపై చిత్తశుద్ధి ఉంటే, వెంటనే సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి, ఎస్సీ ఎస్టీ బీసీ సబ్ ప్లాన్ నిధులు మురిగిపోకుండా 2026 మార్చి లోపు సబ్సిడీ రుణాల కోసం షార్ట్ టైం యాక్షన్ ప్లాన్ తీసుకొచ్చి, నిధులు ఖర్చు చేయాలని నాగేంద్ర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు జయరాం, దానియల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 11)**

స్థానిక ముంగమూరు రోడ్లోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల వాలంటీర్లు జాతీయ సేవా పథకంలో భాగంగా 7 వ రోజు ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, యూనిట్ 2 కొత్తపట్నం మండలం సంకువారిగుంట, టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం గ్రామాలలో గత వారం రోజులుగా చేస్తున్న పలు సేవా కార్యక్రమాలు గురువారంతో ముగిసినట్లు కళాశాల డైరెక్టర్ కమ్ ప్రిన్సిపల్ వై సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ ముగింపు సభ లో ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శ్రద్ధ, సేవా భావంతో ఆయా గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శుభ్రత పరిశుభ్రత మొక్కలు నాటుట రోడ్ల పరిశుభ్రత సమాజసేవ వ్యక్తిత్వ వికాసం ఆరోగ్య అవగాహన ర్యాలీలు సాంప్రదాయ కళలకు ప్రోత్సాహం వంటి వివిధ అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగించినందుకు వాలంటీర్లకు ధన్యవాదాలు తెలియచేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లచే ఇంటింట సర్వే నిర్వహించారు. ఆ సర్వే లో పలు సూచనలు వాలంటీర్లు గ్రామ ప్రజలకు తెలియచేశారు ఆ సర్వేలో మరుగుదొడ్లను ఉపయోగించుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని సూచించారు. తదుపరి సంకువారిగుంట ప్రాథమిక పాఠశాల ఆవరణలో కొన్ని మొక్కలను నాటి అంతకు ముందు ఉన్న మొక్కలకు పాదులు తీయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టీ రాజేంద్ర బాబు, పీ నీలిమ, బి శ్యామల, టి రవితజ, వైస్ ప్రిన్సిపల్ టి రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు నవీన్, ఖాజపీర్, రాజకుమార్, అధ్యాపకేతర సిబ్బంది, సంకువారిగుంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి హెచ్ నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు డి విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన వారిని పీఎంఎంవీవై నందు నమోదు చేయాలి





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, డిసెంబర్ 11)**

కనిగిరి ప్రాజెక్టు సమావేశం గురువారం స్థానిక కనిగిరి ఐసిడిఎస్ కార్యాలయం ఆవరణలో జరిగింది. కనిగిరి, పామూరు, పిసీ పల్లి మండలాల అంగన్వాడి కార్యకర్తలు హాజరైన ఈ సమావేశంలో సిడిపిఓ పి సరోజినీ మాట్లాడుతూ పిల్లల బరువులు గురించి, ప్రధానమంత్రి మాతృ వందన యోజన నందు అర్హులైన లబ్ధిదారులను ఆన్లైన్ నందు నమోదు చేసినట్లయితే వారికి ప్రభుత్వం వారి నుంచి అర్హతను బట్టి రూ.5వేలు, రూ.6 వేలు నగదు విడుదలవుతుందని తెలియజేశారు. ప్రతి ఒక్క అంగన్వాడీ కార్యకర్త వారి కేంద్రం పరిధిలో పిల్లలకు బరువుల విషయంలో, పీఎంఎంవీవై రిజిస్ట్రేషన్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. సూపర్వైజర్లు కోఆర్డినేటర మాట్లాడుతూ పీఎంఎంవీవై లాగిన్ నందు డ్యూ లిస్టులో ఉన్నవి వెంబటే పూర్తి చేయాలని, రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత ఎన్పీసీఐలో ఉంచరాదని తెలియజేశారు. ఏవైనా సాంకేతిక సమస్యలుంటే కార్యాలయానికి రావాలని తెలిపారు. పలువురు కార్యకర్తల యొక్క సందేహాలను నివృత్తి చేయడం జరిగింది. సమావేశంలో సూపర్వైజర్లు పార్వతి, జరిన, పద్మజ, సుమతి, మల్లేశ్వరి, ధనలక్ష్మి, కోఆర్డినేటర్ అశ్విని, ఆయాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోదీ సుపరిపాలన యాత్రను విజయవంతం చేయాలి



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 11)**

ప్రధానమంత్రి మోడీ సుపరిపాలన యాత్రను విజయవంతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొలిశెట్టి పవన్ పిలుపునిచ్చారు. గురువారం బద్వేల్‌లో ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజేపేయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం కడప లో మూడున్నర గంటలకు బిజెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అటల్ మోదీ– సుపరిపాలన యాత్రను ఈ నెల 11 నుంచి 25 వరకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ బస్సుయాత్ర చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ బిజెపి పట్టణ అధ్యక్షుడు ధర్మిశెట్టి వెంకట సుబ్బయ్య, రాయల్ పాల్గొన్నారు.

# సర్వశిక్ష అభియాన్ పీ డీ ని కలిసిన యుటిఎఫ్ నేతలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 11)**

సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరక్టర్ దాసరి అనిల్ కుమార్ ని గురువారం ఆయన కార్యాలయంలో యుటిఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి వీరాంజనేయులు ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విద్యారంగ అభివృద్ధికి యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ తమ వంతు కృషి చేస్తుందన్నారు. అదే విధంగా ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ముందుగా ఉండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఆటల పోటీల నిర్వహణ గురించి చర్చించడం జరిగింది. క్రికెట్‌లో తగినన్ని ఎక్యుమెంట్స్ లేని కారణంగా ఉపాధ్యాయులకు గాయాలు అవుతున్నాయని తెలిపారు. అదే విధంగా ఏసిపి ప్రకాశం జిల్లాలోని స్కూల్ ప్రధానోపాధ్యాయులు అందరికీ లీప్ యాప్‌లో స్కూల్ డొనేట్ కాంపోనెంట్స్‌ను, దానిలోనే ఎస్టిమేషన్ వేసి ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ రవి, జిల్లా కోశాధికారి చిన్న స్వామి, జిల్లా కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, ఎం సంధ్యారాణి, డి జోత్స్న, వై వెంకట్రావ్, కె లక్ష్మీనారాయణ, ఆర్ నారాయణ, తోట శ్రీనివాసరావు, ఏ మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నూతన డిఈఓ సి వి రేణుకను కలసిన ఆపస్ ప్రతినిధులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 11)**

ప్రకాశం జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో నూతనంగా జిల్లా విద్యా శాఖాధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సి వి రేణుకను ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలసి విద్యావిషయక అంశాలను, 10వ తరగతి యాక్షన్ ప్లాన్ గురించి చర్చించారు. డీఈఓను కలిసిన వారిలో రాష్ట్ర సంఘటనా కార్యదర్శి సిహెచ్ శ్రావణ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సిహెచ్ హిమజ, జిల్లా అధ్యక్షులు కమ్మ మల్లికార్జునరావు, జిల్లా బాధ్యులు బి గుణప్రసాద్, కెవి శేషారావు, వి చంద్రశేఖర్, పి రవిశంకర్, రామశర్మ, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో మృతి చెందిన బీహార్ వలస కార్మికుడు చందన్‌కు న్యాయం చేయాలని ధర్నా

## సీఐ సర్ది చెప్పడంతో ధర్నా విరమించిన కార్మికులు



(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 11)

ఇటీవల చీమకుర్తి ఎన్ఎస్పీ కాలనీ వద్ద గల ఎడ్జ్ కటింగ్ యూనిట్ వద్ద పనిచేస్తున్న బీహార్ వలస కార్మికుడు చందన్ విద్యుత్ షాక్ తగిలి మరణించిన విషయం తెలిసిందే. చందన్ పని చేస్తున్న ఎడ్జ్ కటింగ్ యూనిట్ యజమాని తన కుటుంబానికి చెప్పిన మాట ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని, భవిష్యత్తులో లో ఎవరికైనా ఏదైనా అవాంఛనీయ



సంఘటన జరిగి ప్రాణ నష్టం జరిగితే వారికి తగిన నష్ట పరిహారం చెల్లించాలని ఎడ్జ్ కటింగ్, పాలిషింగ్ యూనిట్ల వలస కార్మికులు ధర్నా చేసి నిరసన తెలియపరిచారు. చీమకుర్తి సీఐ ప్రసాదు ధర్నా వద్ద కు చేరుకొని వలస కార్మికుల సమస్యలు విని వారితో చర్చించి ప్రశాంత వాతావరణంలో సమస్యలు పరిష్కరించుకోవాలని, స్థానిక కార్మిక సంఘాల నాయకుల తో కలిసి తమ సమస్యలు పరిష్కారం చేసుకోవాలని,బంద్ లు ధర్నాలు చేయరాదని, కార్మికులు ధర్నాను విరమించి తమ పనులకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు నాయకులు పి ఆంజనేయులు, బీహార్, ఒరిస్సా, ఛత్తీస్‌గడ్, రాజస్థాన్, తదితర రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 13న నవోదయ ప్రవేశపరీక్ష

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 11)

జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-2027 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షను ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 25 కేంద్రాల్లో అభ్యర్థులు 5502 మందికి పరీక్ష నిర్వహిస్తున్నట్లు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ సి శివరామ్ గురువారం వెల్లడించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 5502 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు.ఈ నెల 13వ తేదీ శనివారం ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు. మొత్తం పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష రోజు ఒక గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు. ప్రవేశ కార్డు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.

# జిల్లా విద్యాశాఖ అధికారిగా డి శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 11)

జిల్లా విద్యాశాఖ అధికారిగా డి శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి బాపట్ల జిల్లాకు బదిలీపై వచ్చిన డి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను కలసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు.

# ధనుర్మాస వ్రత మహోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు

## శ్రీ హరిహర క్షేత్రంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 11)

ఈ నెల 16 వ తేదీ నుండి జనవరి 14 వ తేదీ వరకు చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో జరగనున్న ధనుర్మాస వేడుకల పోస్టర్‌ను మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు గురువారం ఒంగోలులోని వారి నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు టి వెంకట హరి కుమారాచార్యులు మాట్లాడుతూ మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ధనుర్మాస వేడుకలు చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తునట్లు తెలిపారు. డిసెంబర్ 16వ తేదీ మధ్యాహ్నం ధనుస్సు సంక్రమణంలో ధనుర్మాస వేడుకలు శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రారంభం అవుతాయన్నారు. జనవరి 14 వ తేదీ శ్రీ గోదాదేవి సహిత శ్రీ రంగనాథ స్వామి తిరు కల్యాణం, జనవరి 25వ తేదీ 16 రోజుల పండుగతో ధనుర్మాస వేడుకలు ముగిస్తాయని ఆలయ అర్చకులు తెలిపారు. స్వామి వారికి ప్రతి నిత్యం తిరుప్పావై, ఆరాధన, అభిషేకాలు, అలంకరణ, తులసీ దళాల అర్చన, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, ప్రవచనాలు వుంటాయని తెలిపారు. డిసెంబర్ 19న సామూహిక కుంకుమర్చన, 23న శ్రీ లక్ష్మి సహిత మహా సుదర్శన హోమం, 25న తిరుప్పావడ సేవ, 27న సామూహిక తులసి దళర్చన, డిసెంబర్ 30న వైకుంఠ ఏకాదశి, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, జనవరి 1న సామూహిక విశేష పుష్పర్చన, జనవరి 3న గోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ, 8న గోపూజ, దీపోత్సవం, 11న గంగళోత్సవం, 13న తిరుమంజన సేవ, 14న గోదాదేవి సహిత శ్రీ రంగనాథ స్వామి కళ్యాణం, 25న పదహారు రోజుల పండగ ఉభయ దాతల సహకారంతో అత్యంత వైభవంగా జరుగుతుందని ఆయన తెలిపారు. శిద్దా వెంకటేశ్వర్లు శ్రీమతి శిద్దా వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, వాహన సౌకర్యం మాజీమంత్రి శిద్దా రాఘవరావు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. శ్రీ హరిహర క్షేత్రంలో జరిగే ధనుర్మాస వ్రత మహోత్సవంలో భక్తులు పాల్గొని శ్రీ రంగనాథ స్వామి వారి ఆశీస్సులు పొంది స్వామి వారి కృపాకటాక్షాలు పొందగలరని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు ప్రభుత్వం వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలి

## మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిసెంబర్ 11)

అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన పెంక్షన్స్ మంజూరు చేసి ప్రభుత్వం ప్రజలను ఆదు కోవాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.గురువారం కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డు లోని 12వ సచివాలయమును ఆకస్మికంగా తనిఖీ చేసి మూమెంట్ రిజిస్టర్ హాజరు పట్టికలను తనిఖీ చేశారు. అనంతరం సంక్షేమ పధకాలు అందటంలేవని అర్హత కలిగిన పెంక్షన్స్ మంజూరు చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్రాక్షాల మారాయని ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్క లబ్ది దారులకు నూతన పెంక్షన్స్ మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం అర్హత కలిగిన లబ్దిదారులకు నూతన పెన్షన్స్ మంజూరు చేయక పోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్త పర్చారన్నారు. పింఛన్ డబ్బులే తమకు జీవనాధారమని,నెలంతా వాటితోటే గడపాలని, మందులకూ అవే దిక్కని వృద్ధులు ఆక్రోశిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో అవ్వాతాతలకు గుడ్ మార్నింగ్ చెప్పి మరీ ఇంటి వద్దే పెన్షన్లు పంపిణి చేయడం జరిగిందని ప్రస్తుతం వ్యవస్థను కక్షపూరితంగా పూర్తిగా నీరుగార్చిందన్నారు. సామాజిక పెన్షన్లకు వైకల్య శాతం పేరుతో దివ్యాంగ పింఛన్లను ప్రభుత్వం ఎగరగొట్టిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన పెంక్షన్స్ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సచివాలయంలోని అధికారులు ప్రభుత్వనికి ప్రజలకు మధ్య జవాబు దారిగా పనిచేయాలని ఆయన కోరారు.



# జిల్లా విద్యాశాఖ అధికారిణి కలిసిన యుటిఎఫ్ నాయకులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 11)

ప్రకాశం జిల్లా నూతన విద్యాశాఖ అధికారిణి సివి రేణుకను జాయినింగ్ అయిన సందర్భంగా మర్యాదపూర్వకంగా యుటిఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి వీరాంజనేయులు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా విద్యారంగ అభివృద్ధికి యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ తమ వంతు కృషి చేస్తుందన్నారు. అదే విధంగా ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ముందుగా ఉండి జిల్లా విద్యాశాఖ అధికారిణికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని ఆమెకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ రవి, జిల్లా కోశాధికారి చిన్న స్వామి, జిల్లా కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, ఎం సంధ్యారాణి, డి జోత్స్న, వై వెంకట్రావ్, కె లక్ష్మీనారాయణ, ఆర్ నారాయణ, తోట శ్రీనివాసరావు, ఏ మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అద్దంకి, బాపట్ల, చీరాల ఆర్టీసి డిపోల నవీకరణకు చర్యలు

## సిఎస్‌కు వివరించిన కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్






(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 11)

జిల్లాలోని అద్దంకి, బాపట్ల, చీరాల ఆర్టీసి డిపోలను నవీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ కు వివరించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ వివిధ ప్రభుత్వ పథకాలపై ప్రజాభిప్రాయ సేకరణ, నాలుగో విడత జరిగే కలెక్టర్ కాన్ఫరెన్స్‌లో చర్చించే అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. బాపట్ల నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ స్థానిక కలెక్టరేట్లోని మినీ వీక్షణ సమావేశం మందిరం నుండి విక్షణ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ, ఇంటి నుండి చెత్త సేకరణ, దీపం - 2, చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ, ఏపీఎస్ఆర్టీసీ బస్సుల సర్వీసులు, రిజిస్ట్రేషన్, వరి కొనుగోలు పై ఐవీఆర్ఎస్ ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయం లో వెనుకబడిన జిల్లాల యొక్క పనితీరును మెరుగుపరుచుకోవాలని ఆయన అన్నారు. ఈ నెల 17, 18 తేదీలలో నిర్వహించే నాలుగో విడత కలెక్టర్ల సమావేశంలో చర్చించే అంశాలపై ఆయన కలెక్టర్లకు వివరించారు. బాపట్లలో ఓల్డ్ బస్టాండ్, న్యూ బస్టాండ్ లు ఉన్నాయని, ప్రజలు ఎక్కువగా ఓల్డ్ బస్టాండ్ నుండి ప్రయాణం సాగిస్తున్నారని, న్యూ బస్టాండ్ ఆవరణ చాలా చిన్నదని, బస్టాండులోని సౌకర్యాలపై ప్రయాణికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నట్లు, బస్టాండ్‌లో ప్రయాణికుల కొరకు సీట్ల అమరిక, మరుగుదొడ్ల సౌకర్యం బాగుందని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర గౌడ్, జిల్లా పౌర సరఫరాల అధికారి జమీర్ భాష, బాపట్ల డిఎల్డిఓ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# హరిహర క్షేత్రంలో ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడి భజన

(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 11)

శ్రీ హరిహర క్షేత్రంలో బుధవారం రాత్రి మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగిన శ్రీ అయ్యప్పస్వామి మహా పడిభజన కార్యక్రమం. సర్వ దీక్ష స్వాముల అయ్యప్ప స్వామి కీర్తనలతో స్వామి వారి మహా పూజ ఘనంగా నిర్వహించారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ల అయ్యప్ప స్వామి సేవా సమాజం ఆధ్వర్యంలో గోపాల గురుస్వామి, ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో సర్వ దీక్షా స్వాములకు, భక్తులకు అల్పాహారం, అన్న ప్రసాదాల వితరణ అందజేశారు. ఈ కార్యక్రమంలో శిద్దా సుధాకర్, చీమకుర్తి పరిసర ప్రాంతాలకు చెందిన సర్వ దీక్షా స్వాములు, చీమకుర్తికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.









# నీటి సమస్యను పరిష్కరించుటమే లక్ష్యం

## మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిసెంబర్ 11)

నీటి సమస్యకు శాస్వితముగా పరిష్కరించడమే ముఖ్య లక్ష్యమని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.సమస్య పరిష్కారంలో భాగంగా ప్రజల ఫిర్యాదు మేరకు గురువారం కనిగిరి పట్టణంలోని రజక బజార్ 14 వ వార్డులో ఆయన పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకోగా నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని పైపు లైన్స్ లేకేజీలు వల్ల నీరు వృద్ధాగా పోవడం జరుగుతున్నాయని చైర్మన్ దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి అధికారులను పిలిపించి త్వరితగతన నీటి సమస్యలు లేకుండా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీలో శాస్విత నీటి పరిస్కారం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ట్యాంకర్స్ ద్వారా 420నుండి 100 ట్యాంకర్ల కు తగ్గించి పైపు లైన్స్ ద్వారా శాశ్విత నీటి పరిస్కారం చూపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలతో అమూల్యమైన జీవితాన్ని కోల్పోతారు

## జిల్లా బాలల సంరక్షణ అధికారి పి దినేష్ కుమార్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 11)

బాల్య వివాహాలు చేయటం ద్వారా చిన్న వయసులోనే వారు తమ అమూల్యమైన జీవితాన్ని, అభివృద్ధిని కోల్పోతారని బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ప్రకాశం జిల్లా బాలల సంరక్షణ అధికారి పి దినేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బాల్య వివాహాల విముక్తి భారత్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా టంగుటూరు మండలం బి నిడమారు గ్రామంలోని కేజీబీ పాఠశాలలో బాల్య వివాహాల పైన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బాల్య వివాహాలు చట్టరిస్తే నేరమని, చిన్న వయసులోనే అభం శుభం తెలియని బాలికలకు బాల్యవాలు చేసి వారికి అమూల్యమైన జీవితాలు నాశనం చేయొద్దన్నారు. బాలికల అభివృద్ధికి మనందరం సహకరించాలన్నారు. బాలిక ఇంటికి భారం అనే ఆపోహాలో తల్లిదండ్రులు ఉండరాదన్నారు. ఇటువంటి అపోహాలను తల్లిదండ్రులు దూరం చేసుకోవాలని, ప్రతి బాలిక అభివృద్ధి చెందితే కుటుంబ వ్యవస్థ, సమాజం అభివృద్ధి చెందినట్టు అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు, సింగరాయకొండ ఐసిడిసి సూపర్వైజర్లు, అంగన్వాడి కార్యకర్తలు, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప ఆలయంలో పూజలో పాల్గొన్న బాలినేని దంపతులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 11)

హైదరాబాలోని మాదాపూర్ 100 అడుగుల రోడ్‌లో గల అయ్యప్ప స్వామి దేవాలయం నందు మాజీ మంత్రి, జనసేన రాష్ట్ర నాయకులు బాలినేని శ్రీనివాస్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ముందస్తుగా ప్రత్యేక పూజల్లో బాలినేని దంపతులు పాల్గొన్నారు. జనసేన సెంట్రల్ ఆంధ్ర కమిటీ మెంబర్ మాదాసు రమేష్ ఆధ్వర్యంలో పడిపూజ అనంతరం భిక్ష ఏర్పాటు చేసారు.

# 13న అన్ని న్యాయ స్థానాలలో జాతీయ లోక్ అదాలత్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 11)

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల ప్రకారం ప్రకాశం జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయ స్థానాలలో జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 13న నిర్వహించబడుతుందని ఇంచార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్ టి రాజ్యలక్ష్మి అన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ పడదగిన అన్ని క్రిమినల్ కేసులు అన్ని రకాల సివిల్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద వ్యాజ్యాలు, అన్ని రకాల బ్యాంకు కేసులు పరిష్కరించబడతాయని తెలిపారు. అదే విధంగా ప్రీ లిటిగేషన్ స్థాయిలో కూడా కేసులు పరిష్కరించుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎక్సైజ్ కేసులు ట్రాఫిక్ కేసులు కూడా ఈ జాతీయ లోక్ అదాలత్ నందు పరిష్కరింపబడతాయని, ఈ అవకాశాన్ని కక్షిరుధాలు ఇరువురు ఉపయోగించుకొని సమస్యను పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు వ్యాజ్యాల పరిష్కారం కోసం జిల్లావ్యాప్తంగా 29 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రి సిట్టింగ్‌ల ద్వారా 15,150 కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. దీని ద్వారా తక్కువ సమయంలోనే కేసులు పరిష్కరించుకోవచ్చని అన్నారు.

# ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 11)

ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి, ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. బాపట్ల పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్‌ను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్ లో ఆయన కలియతిరిగారు. ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం పాత బస్సు స్టాప్ కూడలికి ఆయన చేరుకుని పరిశీలించారు. ప్రయాణికులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేకపోవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ నిర్మాణం జరిగి కొన్నేళ్లు గడుస్తున్నప్పటికీ సౌకర్యాలు లేని బస్సు స్టాప్ వద్ద ప్రయాణికులు అధికంగా ఉండడంపై ఆరా తీశారు. అని సౌకర్యాలతో ఉన్న బస్టాండ్ ను ప్రయాణికులు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఎల్లప్పుడు పరిశుభ్రంగానే ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. బాపట్ల బస్టాండ్‌లో ఏడు ఫ్లాట్ ఫామ్‌లు ఉండగా, ప్రతి రోజు 100కు పైగా బస్సులు వస్తాయని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వీరభద్రరావు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ప్లాట్ ఫామ్‌ల వద్ద కలెక్టర్ పరిశీలించారు. మరుగుదొడ్ల లోకి వెళ్లి పరిశుభ్రతను పరిశీలించారు. తక్షణమే పారిశుద్ధ్య కార్మికులను నియమించుకోవాలని చెప్పారు. ప్రయాణికులకు తప్పనిసరిగా తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సులు లోపలికి వెళ్లే మార్గం, వెలుపలకు వచ్చు మార్గాలను పరిశీలించారు. పార్కింగ్ స్థలం, అద్దెకు ఇచ్చిన వాణిజ్య సముదాయాన్ని ఆయన పరిశీలించారు. వాటి ద్వారా అద్దెలు క్రమంగా వస్తున్నాయా లేదా అని ఆరా తీశారు. డిపో మేనేజర్ కార్యాలయాన్ని, డ్రైవర్లు స్టాఫ్ రెస్ట్ రూమ్ లను పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడారు. ప్రయాణికులకు వీలుగా బస్సులు నడుస్తున్నాయా? సకాలంలో వస్తున్నాయా... సరిగా సమాధానం చెబుతున్నారా..? తాగునీరు అందుబాటులో ఉంటుందా? అంటూ ఆరా తీశారు. అనంతరం బస్సు స్టాప్ కూడలికి చేరుకున్నారు. అక్కడ వసతి సౌకర్యాలు పరిశీలించారు. నీటి ట్యాప్ కనెక్షన్లు ఉన్నప్పటికీ తాగునీరు రాకపోవడంతో యుద్ధ ప్రాతిపదికన తాగు నీటి సౌకర్యం కొరకు ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బస్సు స్టాప్ ను ఆధునికరించాలని, ప్రయాణికులు వేచి ఉండడానికి మంచి కుర్చీలు సౌకర్యంగా ఏర్పాటు చేయాలన్నారు. బస్సు స్టాప్ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతిరోజు పారిశుద్ధ్య కార్మికులు వచ్చి శుభ్రం చేయాలన్నారు. ఇందు కొరకు డ్యూటీలు వేయాలన్నారు. ఆయన వెంట ఆర్డిఓ పి గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహసిల్దార్ షాలీమా, తదితరులు ఉన్నారు.








## తోట సుధీర్ కలిసిన ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్



(షణ్ముఖ వెలుగు, పామూరు, డిసెంబర్ 11)

రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పోరేషన్ చైర్మన్ తోట సుధీర్‌ని కాకినాడలోని వారి నివాసంలో జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలు వారు చర్చించారు.

## మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసిన చిట్యాల విజయ భాస్కర్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, డిసెంబర్ 11)

తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో గురువారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్ర ఐటి వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయ భాస్కర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితిపై చర్చించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ గెలుపు కోసం కృషి చేసి తమరిని ముఖ్యమంత్రిని చేసుకుంటామన్నారు.

## వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ మీర్జా షంషీర్ అలీబెగ్

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 11)



రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కమిటీ నుండి ఆయనకు అధికారికంగా గురువారం ఉత్తర్వులు అందాయి. ఈయన గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఏపి మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొద్దికాలం బాధ్యతలను నిర్వర్తించారు. అలాగే 2014 – 2024 మధ్య కాలంలో పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా కూడా పనిచేశారు. 2014, 2019, 2024 సంవత్సరాలలో జరిగిన శాసన సభ, లోక్ సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం తీవ్రంగా కృషి చేశారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రత్యేకంగా మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశారు. ఈయన పార్టీ ఆవిర్భావం నుండి అదే పార్టీలో కొనసాగుతూ చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శాయి శక్తుల కృషి చేస్తూ వస్తున్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ పార్టీ అభివృద్ధి కోసం అకుంఠిత దీక్షతో పాడుపడుతూ ఆ పార్టీ నాయకులు,కార్యకర్తల అభిమానాన్ని చూరగొంటున్నారు. అలీబేగ్ సామాజిక దృక్పథంతో వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించి పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అలాగే డాక్టర్ మీర్జా షంషీర్ అలీబెగ్ చారిటబుల్ ట్రస్ట్ ను ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. పార్టీ స్టేట్ సెక్రెటరీగా నియమితులైన సందర్భంగా డాక్టర్ మీర్జా షంషీర్ అలీబెగ్ కు నియోజక వర్గ పార్టీ ఇన్చార్జి,మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పార్టీ స్టేట్ సెక్రటరీ కెవి రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, బిసి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిఎల్‌పి యాదవ్, వైసిపి ఇంటలెక్చువల్ విభాగం రాష్ట్ర సెక్రెటరీ మేడా బద్రీనాథ్, పార్టీ రాష్ట్ర నాయకులు వైవి వెంకటేశ్వర రావు, పొదిలి పట్టణ పార్టీ అధ్యక్షులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పోరెడ్డి చెంచిరెడ్డి, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, పార్టీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ సయ్యద్ మక్బూల్ భాషతో పాటు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## అయ్యప్ప స్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, పామూరు, డిసెంబర్ 11)

జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు, ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, రేణుకాల వివాహ వార్షికోవత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మాల ధారణ స్వాములకు అయ్యప్పస్వామి దేవస్థానం నందు కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములు ఆకుపాటి వెంకటేష్ దంపతలకు ఆశీర్వచనాలు అందజేశారు.

## గంజాయి అమ్ముతున్న మహిళ అరెస్ట్

### మరో ముగ్గురి కోసం గాలింపు

(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 11)

చీమకుర్తి మండలం జి ఎల్ పురం గ్రామంలోని ఎస్టి కాలనీ వద్ద గంజాయి అమ్ముతున్న నాగులూరి మార్తమ్మను మధ్యవర్తుల సమక్షంలో గురువారం అరెస్ట్ చేశారు. ఆమె వద్ద ఉన్న 1.850 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సదరు మార్తమ్మ తో పాటు గంజాయి అమ్మిన మరో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. చీమకుర్తి సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com